క్లుప్తంగా

తహసీల్దార్‌కు సన్మానం


సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

వీణవంక: వీణవంక తహసీల్దార్‌గా మంజుల ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. గురువారం బొంతుపల్లి గ్రామ మాజీ ఉపసర్పంచ్‌లు బావు సంపత్, రాయమల్లు, జితేందర్ రెడ్డి, రేగుల ఓదెలు, పొన్నాల లక్ష్మణ్, కుమారస్వామి మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు.

పశుగ్రాసం వితరణ


ట్రాక్టర్‌లో గడ్డి కట్టలు తరలిస్తున్న భక్తులు

చొప్పదండి: పట్టణంలోని జ్ఞాన సరస్వతి ఆలయంలో నిర్వహిస్తున్న గోశాలకు మండలంలోని రుక్మాపూర్ గ్రామానికి చెందిన మేకల కనకమ్మ భర్త జ్ఞాపకార్థం గురువారం గడ్డి కట్టలు వితరణ చేశారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు సింహాచలం జగన్‌మోహన్ స్వామి, భాష్యం నవీన్ కుమార్, మేకల తిరుపతి, లావణ్య, గాండ్ల అంజయ్య, కైరి మల్లేశం, సంబోజి భాను, తదితరులు పాల్గొన్నారు.

చెల్పూర్ హైస్కూల్‌లో ఆటల పోటీలు

హుజూరాబాద్: మండలంలోని చెల్పూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలలో గురువారం జిల్లా రగ్బీ కమిటీ ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. పోటీలను జిల్లా రగ్బీ ప్రెసిడెంట్ చిరంజీవి, ప్రధాన కార్యదర్శి నిరంజన్ ప్రారంభించారు. ఆటల పోటీలనుద్దేశించి గ్రామానికి చెందిన సామాజికవేత్త ఆకినపల్లి శిరిష మాట్లాడారు. క్రీడలతో విద్యార్థులకు శారీరక, మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. వేసవిలో విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా క్రీడాశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో రిటైర్డ్ పీఈటీలు సారయ్య, రాజిరెడ్డి, చెల్పూర్ పీఈటీ శ్రీనివాస్, విద్యార్థులు పాల్గొన్నారు.

వార్డుల్లో మున్సిపల్ కమిషనర్ పర్యటన


ట్రిమ్మింగ్ చేస్తున్న కమిషనర్ సమ్మయ్య

హుజూరాబాద్: పట్టణంలోని పలు వార్డుల్లో గురువారం తెల్లవారుజామున మున్సిపల్ కమిషనర్ కె. సమ్మయ్య పర్యటించారు. మున్సిపల్ సిబ్బందితో కలిసి పరిసరాల శుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించారు. భవిష్యత్ తరాల బాగు కోసం ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలన్నారు. చెత్త రహిత మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రజల భాగస్వామ్యం తప్పనిసరి అని పేర్కొన్నారు. అనంతరం ఆయా వార్డులో ఏపుగా పెరిగిన మొక్కలకు ట్రిమ్మింగ్ చేయించారు.

సీపీకి రిటైర్డ్ టీచర్ ఫిర్యాదు

వీణవంక: మండలంలోని ఇప్పలపల్లి గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు ముదిగంటి రఘునాథ్‌రెడ్డి కరీంనగర్ సీపీ గౌస్ ఆలంకు ఫిర్యాదు చేశాడు. పాఠశాల ఆవరణలో కొందరు దుకాణాలు నిర్మించుకొని వ్యాపారం చేసుకుంటున్నారని ఇటీవల జెడ్పీ సీఈవోకు రఘునాథ్‌రెడ్డి ఫిర్యాదు చేయగా డిప్యూటీ సీఈవోను విచారణ చేయాలని ఆదేశించారు. ఈ నెల 3న చల్లూరులో విచారణ జరుగుతుండగా కొందరు అకారణంగా దూషించడంతో పాటు చంపుతామని బెదిరించారాని ఫిర్యాదులో పేర్కొన్నారు. స్పందించిన సీపీ జమ్మికుంట రూరల్ సీఐని విచారణ చేయాల్సిందిగా ఆదేశించారు.

పెళ్లి బరాత్‌లో హల్‌చల్

వీణవంక: మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో బుధవారం రాత్రి పెళ్లి బరాత్‌లో యువకులు హల్‌చల్ చేశారు. డీజేలతో డ్యాన్స్ చేస్తుండగా ఓ కానిస్టేబుల్ అక్కడికి చేరుకొని వీడియో తీస్తుండగా మద్యం మత్తులో కొందరు యువకులు కానిస్టేబుల్ సెల్‌ఫోన్ తీసుకొని దురుసుగా ప్రవర్తించారు. యువకులను ఎంత సముదాయించిన వినకుండా కొద్దిసేపు నానా హంగామా చేశారు. గురువారం సీఐ కిషోర్ యువకులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. సదరు యువకులపై కేసు నమోదు చేయనున్నట్లు తెలిసింది.

విద్యుదాఘాతంతో ఆవు మృతి

హుజూరాబాద్: సైదాపూర్ మండలంలోని ఎల్లంపల్లి గ్రామానికి చెందిన భూతాల బాపురావు పాడి ఆవు ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌తో గురువారం మృతి చెందింది. పొలాల్లో గడ్డి మేస్తూ ట్రాన్స్‌ఫార్మర్ వైపు వెళ్లగా షాక్ తగిలి మృతి చెందిందని ప్రభుత్వం సాయం అందించాలని బాపురావు కోరాడు.

- అసంపూర్తిగా అరుంధతి కల్యాణమండపం
- ప్రైవేట్ ఫంక్షన్ హాళ్లలో పేదింటి ఆడబిడ్డల పెళ్లికి రూ. వేలల్లో ఖర్చు

పూర్తి కాదు.. వినియోగంలోకి రాదు


కేశవపట్నంలో నిర్మిస్తున్న అరుంధతి కల్యాణ మండపం

శంకరపట్నం: పేదింటి ఆడబిడ్డ పెళ్లి తల్లిదండ్రులకు భారం కాకూడదని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి పథకం ప్రవేశపెట్టింది. అలాగే పెళ్లికి ఫంక్షన్‌హాల్ ఖర్చు భారం కాకూడదని అరుంధతి కల్యాణ మండపాల నిర్మాణానికి ప్రభుత్వ భూములు కేటాయించింది. 2021 ఏప్రిల్‌లో రూ.50 లక్షల నిధులతో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ కేశవపట్నానికి అరుంధతి కల్యాణమండపాన్ని మంజూరు చేయించి శంకుస్థాపన చేశారు. ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో రూ.వేల కిరాయి చెల్లించి పెళ్లిళ్లు చేస్తున్నారని అదనపు భారం పడొద్దని నిర్మిస్తున్న అరుంధతి కల్యాణ మండపం పనులు పూర్తికాలేదు. రంగులు, టైల్స్, ప్రహరీ, మరుగుదొడ్లు, మూత్రశాలలు నిర్మించకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మండలానికి మంజూరైన కల్యాణ మండపం నిరుపయోగంగా మారనుందనే విమర్శలు వెలువడుతున్నాయి. మానకొండూర్ అసెంబ్లీ స్థానం ఎస్సీ రిజర్వ్‌డ్ కావడంతో 2009లో ఆరెపల్లి మోహన్, 2014, 2018లో రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేలుగా ప్రాతినిధ్యం వహించారు. ప్రస్తుతం కవ్వంపల్లి సత్యనారాయణ అధికార పార్టీ ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. వీరు ముగ్గురు అధికార పార్టీ ఎమ్మెల్యేలుగా కొనసాగిన, కొనసాగు సాగుతున్న గత, ప్రస్తుత ఎమ్మెల్యే పనులు పూర్తిచేయించడంలేదని ప్రజలు బహిరంగంగానే ఆరోపణలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రసమయి బాలకిషన్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు భూమి కేటాయించి, నిధులు మంజూరు చేయించి తుది దశ వరకు పనులు చేయించారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అరుంధతి కల్యాణ మండపం మిగులు పనులు పూర్తి చేయించాలని కోరుతున్నారు. నిర్మాణం పూర్తయితే పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్లు చేయడానికి తల్లిదండ్రులకు ప్రైవేట్ ఫంక్షన్‌హాళ్ల ఖర్చు తగ్గనుంది. ఆ దిశగా ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఆధ్యాత్మికం

సుందరగిరిలో ఘనంగా శకటోత్సవం


ఎడ్లబండిపై ప్రదక్షిణలు చేస్తున్న భక్తులు

చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి శ్రీవేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం శకటోత్సవం నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా కొత్త, పాత వాహనాలు అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ఎడ్లబండ్లు, ట్రాక్టర్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు, కార్లను పూలతో సుందరంగా అలంకరించి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. చిగురుమామిడి సింగిల్‌విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, హుస్నాబాద్ వ్యవసాయమార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ శంకరయ్య, ఈఓ రాజ్‌కుమార్, ఆలయ కార్యనిర్వహణ అధికారి బూట్ల కవిత, డైరెక్టర్లు, ప్రముఖులు శకటోత్సవంలో పాల్గొన్నారు. శుక్రవారం వేకువజాము నుంచి రథోత్సవం నిర్వహించనున్నామని ఆలయ ఈఓ రాజ్‌కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.


హోమం నిర్వహిస్తున్న వేద పండితులు, భక్తులు

ఘనంగా చండీ, రుద్ర నవగ్రహ యాగం

జమ్మికుంట: పట్టణంలోని శ్రీ సంతోషిమాతా దేవాలయంలో మహాకుంబాభిషేకం ఉత్సవాల్లో భాగంగా గురువారం వేద పండితులు స్థాపిత దేవత పూజలు, చండీ, రుద్ర, నవగ్రహ, మహాలక్ష్మి యాగం, ప్రత్యేక పూజలు చేశారు. శ్రీసచ్చిదానంద సరస్వతి మహాస్వామి ఆధ్వర్యంలో శ్రీసంతోషిమాత శోభాయాత్ర కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. యాగం, హోమంలో దంపతులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అనంతరం అధిక సంఖ్యలో హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు.

చిడతల రామాయణం ప్రారంభం


రామాయణం ప్రదర్శనలో పాత్రధారులు

చొప్పదండి: అంతరించిపోతున్న కళలను కపాడుకునేందుకు మండలంలోని గుమ్లాపూర్ గ్రామస్తులు నడుం బిగించారు. గ్రామంలోని వెంకటేశ్వర భజన మండలి సభ్యులు మూడు నెలలుగా శిక్షణ పొంది గ్రామంలో బుధవారం రాత్రి చిడతల రామాయణం ప్రదర్శించారు. మొదటి రోజు భరతుడి పాదుకా పట్టాభిషేకం, రెండో రోజు సుగ్రీవ పట్టాభిషేకం నిర్వహించారు. శుక్రవారం రాత్రి విభీషణ, శనివారం రాత్రి సీతారాముల పట్టాభిషేకం నిర్వహిస్తానమని తెలిపారు. గ్రామస్తుల సహకారంతో గురువు పిట్టల సంపత్ ఆధ్వర్యంలో నిర్వహించిన సీతారాముల కల్యాణానికి పరిసర గ్రామాల నుంచి ప్రజలు తరలివచ్చారు. కార్యక్రమంలో రూపిరెడ్డి స్కైలాబ్ సత్యనారాయణరెడ్డి, తాళ్లపల్లి పర్శరాములు గౌడ్, పెరుమాండ్ల అంజయ్యగౌడ్, చిర్ర రమేశ్, మంథని మణితేజ, చిర్ర తిరుపతి, శనిగరం రాజేశం, బూరుగు హరీశ్ గౌడ్, పెరుమాండ్ల సత్యం గౌడ్, వెల్మ రఘుపతిరెడ్డి, సస్యశ్రీ, మహేశ్‌గౌడ్, ఎడవెల్లి రా జిరెడ్డి, సాత్విక్, వెంకటేశ్, లింగయ్యగౌడ్, విలాసాగరం శ్రీనివాస్, తదితదరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కల్నల్ సునీల్ అబ్రహం


శిక్షణకు హాజరైన కెడెట్లు

కిట్స్‌లో ఎన్‌సీసీ శిక్షణ శిబిరం ప్రారంభం

హుజూరాబాద్: మండలంలోని సింగాపూర్ కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో లెఫ్టినెంట్ కల్నల్ కె.జయంత్ అధ్యక్షతన నేషనల్ కెడెట్ క్రాప్స్ లీడర్షిప్ శిక్షణను ఏపీ, తెలంగాణ డైరెక్టర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయగా నిజామాబాద్ గ్రూప్ కమాండర్ కల్నల్ సునీల్ అబ్రహాం గురువారం ప్రారంభించారు. విద్యార్థులకు జాతీయ సమగ్రత, ఉపాధి అవకాశాల గురించి శిక్షణ ఇస్తామని వివరించారు. శిక్షణలో కెడెట్లకు లీడర్ షిప్ క్వాలిటీస్, పర్సనాలిటీ డెవలప్మెంట్, ఎస్ఎస్‌బీ సెలక్షన్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ టూ బాటిల్ క్రాఫ్, వెపన్ ట్రైనింగ్, హెల్త్ అండ్ హైజిన్, డ్రిల్ విత్ వెపన్‌లలో శిక్షణ ఇస్తామన్నారు. అనంతరం కళాశాల ఎన్‌సీసీ అధికారి కల్లెం రవీంద్రబాబు మాట్లాడుతూ.. క్యాంపులో 310 కెడెట్లు పాల్గొంటారని, 14 నుంచి 25 వరకు క్యాంపు కొనసాగుతుందన్నారు. అన్యువల్ ట్రైనింగ్ క్యాంప్ 16 నుంచి 25 వరకు కొనసాగుతుందన్నారు. మధ్యప్రదేశ్, ఒడిశా, ఏపీ, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి క్యాడెట్లు రానున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎన్సీసీ అధికారులు పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత


సమ్మె నోటీసు అందజేస్తున్న నాయకులు, కార్మికులు

జమ్మికుంట: తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్, వర్కర్స్ యూనియన్ జమ్మికుంట మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం ఎంపీడీవో భీమేశ్‌కు సమ్మె నోటీసు అందజేశారు. సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కొప్పుల శంకర్ మాట్లాడుతూ... ఈ నెల 20న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె నిర్వహణలో భాగంగా నోటీసు అందజేశామన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తుందని, నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకువచ్చి కార్మిక వర్గానికి నష్టం చేసుందని, సమ్మె విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రవీందర్‌రావు, కార్యదర్శి లద్దునూరి కుమార్, కోశాధికారి మేకమల్ల రాము, కమిటీ సభ్యులు రాజయ్య, సంపత్, తిరుపతి, రవి, మైపాల్‌రెడ్డి పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

బాక్స్ క్రికెట్ ప్రారంభం

హుజూరాబాద్: పట్టణంలోని విద్యానగర్ సహస్త పాఠశాలలో ఏర్పాటు చేసిన బాక్స్ క్రికెట్‌ను టౌన్ సీఐ కరుణాకర్ గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా సీఐ మాట్లాడుతూ... బాక్స్ క్రికెట్ ద్వారా క్రికెట్ బేసిక్స్ నేర్చుకోవచ్చని క్రీడాకారులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. సీఐగా బాధ్యతలు స్వీకరించిన కరుణాకర్‌ను మాజీ కౌన్సిలర్ ముక్కపల్లి కుమార్‌యాదవ్, బీఆర్‌ఎస్ నాయకులు పోతనవేణి అనిల్‌కుమార్‌యాదవ్, గొవిందుల స్వప్నభాస్కర్ మర్యాద పూర్వకంగా కలిశారు అనంతరం సన్మానించారు.

ఘనంగా బుద్ధ జయంతి

విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్‌లో గురువారం మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో బుద్ధ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. బుద్ధ జయంతి కమిటీ చైర్మన్ పాతకుల భూమయ్య, మాల సంఘాల జేఏసీ జిల్లా చైర్మన్ బొగ్గుల మల్లేశం, నాయకులు మేడి అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు ఇళ్లలో చోరీ

రామడుగు: మండలంలోని గోపాల్‌రావుపేట లో రెండు ఇండ్లల్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు ట్రైనీ ఎస్సై సతీష్ తెలిపారు. గ్రామానికి చెందిన నల్ల శ్రీనివాస్, ఎగుర్ల బీరయ్యలు బుధవారం వేములవాడకు వెళ్లారు. వీరి ఇళ్ల తాళాలు పగలగొట్టి బీరవాలలో ఉన్న మూడున్నర తులాల బంగారం, 70 తులాల వెండి కడియాలను ఎత్తుకెళ్లారు. బాధితుల ఫిర్యాదుతో గురువారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

తనిఖీల రిపోర్టు బహిర్గతం చేయాలి

కరీంనగర్: ఉన్నత విద్యామండలి తనిఖీల రిపోర్టును బహిర్గతం చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్ ప్రకటనలో డిమాండ్ చేశారు. తనిఖీల్లో అనేక లోపాలు బయటపడ్డాయని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అధ్యాపకులను నియమించకుండా బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేయటం కోసం సిలికాన్ వేలి ముద్రలతో అక్రమంగా అధ్యాపకులు ఎక్కువగా ఉన్నారనే పేరుతో ప్రభుత్వం, ఉన్నత విద్యామండలిని ప్రైవేట్ ఇంజినీరింగ్ కళాశాలలు మోసం చేస్తున్నాయని, రాష్ట్రంలో 175 ఇంజనీరింగ్ కళాశాలలు ఉండగా అందులో కేవలం పదుల సంఖ్యలో ఉన్న ఇంజనీరింగ్ కళాశాలలు మాత్రమే టీఏఎఫ్‌ఆర్‌సీ నిబంధనలకు అనుగుణంగా అధ్యాపకులు, సౌకర్యాలు కలిగి ఉన్నాయన్నారు. ఇంజినీరింగ్ కాలేజీల్లోని లోపాల మీద సీఎం సమీక్ష చేసి చర్యలు తీసుకోవాలన్నారు. ఫీజులు పెంచకుండా తగ్గించే ప్రయత్నం చేయాలని, కాలేజీల అక్రమాలను బయటపెట్టి పేద విద్యార్థులందరికీ ఇంజినీరింగ్ విద్య అందించే ప్రయత్నం చేయాలని డిమాండ్ చేశారు.

పట్టణ ప్రణాళిక అధికారులపై ఫిర్యాదు

కరీంనగర్ కార్పొరేషన్: సెట్‌బ్యాక్ లేకుండా నిర్మించిన ఇంటి వ్యవహారంలోపై పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని నగరంలోని సప్తగిరికాలనీకి చెందిన ఎండీ.జావిద్ హుస్సేన్ ఆరోపించారు. ఈమేరకు నగరపాలకసంస్థ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలో నిబంధనలు ఉల్లంఘించి నిర్మించిన ఇంటి వ్యవహారంపై గతంలోనే ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. నిర్మాణంలో నిబంధనలు ఉల్లంఘించినట్లు గుర్తించారని, కాని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు మాత్రం చర్యలు తీసుకోవడం లేదన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



చిగురుమామిడి: మండలంలోని సుందరగిరి జెడ్పీపాఠశాల 2006–07 పదో తరగతి విద్యార్థులు గురువారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. అందరు ఒకచోట చేరి ఆప్యాయంగా పలకరించుకుంటూ చదువుకున్న రోజులనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో లలిత, సతీష్, రవీందర్, వినోద్‌కుమార్, సంపత్, శేషం ప్రియాంక, శ్రీని వాస్, అరవింద, అనూష, శ్రీతేజ, స్వప్న పలువురు పాల్గొన్నారు.



శంకరపట్నం: మండలంలోని కేశవపట్నంలో గ్రామ పంచాయతీ సిబ్బంది విద్యుత్ స్తంభాలకు వీధి దీపాలు అమర్చారు. వారం రోజులుగా వీధిలైట్లు వెలగకపోవడంతో గ్రామంలోని 3, 4, 5 వార్డుల ప్రజలు చీకట్లో ఇబ్బందులపడుతున్నారని గురువారం సాక్షిలో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. స్పందించిన ఎంపీడీవో కృష్ణప్రసాద్ జీపీ సిబ్బందితో వీధి దీపాలు ఏర్పాటు చేయించారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

ఇసుక అక్రమ రవాణా చేస్తే చర్యలు


గన్నేరువరం: మాట్లాడుతున్న సీఐ సదన్‌కుమార్

గన్నేరువరం: అనుమతి లేకుండా ఇసుక అక్రమంగా రవాణా చేస్తే కఠిన చర్యలు తప్పవని తిమ్మాపూర్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. గురువారం గన్నేరువరం పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేశారు. అనంతరం ట్రాక్టర్ యాజమానులతో మాట్లాడారు. ఇసుక రవాణా చేసే సమయంలో అనుమతి పత్రాలు వెంట ఉండాలని సూచించారు. నింబంధనలను అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. వెంట ట్రైనీ ఎస్సై అరుణ్, ఏఎస్సై రాధాకిషన్, హెడ్‌కానిస్టేబుల్ భాస్కర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

అక్రమంగా గోవులను తరలించొద్దు


తిమ్మాపూర్: బక్రీద్ పండుగ సందర్భంగా గోవులను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ హెచ్చరించారు. గురువారం మండల కేంద్రంలో మాట్లాడారు. అనుమతి లేకుండా పరిమితికి మించి పశువులను తరలించొద్దని గ్రామ పంచాయతీ, అధికారుల అనుమతి తప్పనిసరని, పశువైద్యాధికారి ధ్రువీకరణ పత్రం వెంట ఉండాలని సూచించారు. మండలంలోని రేణికుంట టోల్ ప్లాజా వద్ద ప్రత్యేక చెక్‌పోస్ట్ ఏర్పాటు చేశామన్నారు. శాంతియుత వాతావరణం కోసం అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. అందరూ చట్టాన్ని గౌరవించాలని సీఐ కోరారు.


గ్యాస్ వినియోగదారులు జాగ్రత్తలు పాటించాలి



గ్యాస్ సిబ్బందితో పీవీ మధన్‌మోహన్

హుజూరాబాద్: గ్యాస్ వాడకంలో వినియోగదారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని తెలంగాణ గ్యాస్ డీలర్ల సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి, మేనేజింగ్ పార్టనర్ పీవీ మధన్‌మోహన్ అన్నారు. గురువారం పట్టణంలోని అంబుజా గ్యాస్ ఏజెన్సీ ప్రాంగణంలో మాట్లాడారు. ఏప్రిల్ నుంచి డిసెంబరు వరకు ప్రభుత్వ పిలుపు మేరకు బేసిక్ సేఫ్టీ చెక్ కార్యక్రమాలు నిర్వహించి సిలిండర్ వాడే విధానం, లీకేజీకి టోల్ ఫ్రీ నంబర్ 1906 డయల్ చేయడం వంటి విషయాలపై అవగాహన కల్పించామన్నారు. కస్టమర్లు గ్యాస్ రాయితీ పొందేందుకు ఈకేవైసీ విధిగా చేసుకోవాలని, నాణ్యమైన రబ్బరు ట్యూబులు వాడకపోతే ప్రమాద బీమా రాదని తెలిపారు. ఆయిల్ కంపెనీలు అందించే వాటిని వాడాలని కోరారు. ఏజెన్సీ వార్షికోత్సవం సందర్భంగా సిబ్బందితో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మేనేజర్ దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.


జమ్మికుంట: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు


ఇల్లందకుంటలో..

దిష్టిబొమ్మ దహనం

ఇల్లందకుంట: టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్, సీనియర్ నాయకుడు జగ్గారెడ్డి మల్కాజిగిరి ఎంపీ ఈటలరాజేందర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను మండలంలోని బీజేపీ నాయకులు ఖండించారు. శుక్రవారం పార్టీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గరుడ చౌరస్తాలో మహేశ్‌కుమార్‌గౌడ్, జగ్గారెడ్డి దిష్టిబొమ్మలను దహనం చేశారు. అనంతరం సీనియర్ నాయకుడు సింగిరెడ్డి తిరుపతిరెడ్డి మాట్లాడుతూ... ఈటల రాజేందర్ కుల ప్రస్తావన తీసుకురావడమేంటని ప్రశ్నించారు. రాష్ట్రంలో కుల గణన చేసి దేశానికే ఆదర్శంగా నిలిచామని గొప్పలు చెప్పుకునే కాంగ్రెస్ ప్రభుత్వం ఈటల కులమేదో నమోదు చేయలేదా అని అన్నారు. మీరు చేసిన కులగణన అంతా బూటకమేనా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు మాట తీరు మార్చుకొని పలువురికి ఆదర్శంగా ఉండాలని హితవు పలికారు. కార్యక్రమంలో కంకణాల సురేందర్‌రెడ్డి, కొత్త శ్రీనివాస్, గురుకుంట్ల సాంబయ్య, ఎండీ.షఫీఖాన్, శీలం శ్రీనివాస్, కందాల రాజేందర్, గుత్తికొండ రాంబాబు, మట్ట పవన్ రెడ్డి, రాజయ్య, దుర్గయ్య, మట్ట బాల్‌రెడ్డి, రాజు, ఓంకార్, చదువు సాయిరెడ్డి, స్వామిదాసు తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: పట్టణంలోని గాంధీ చౌక్‌వద్ద బీజేపీ నాయకుడు ఎర్ర ంరాజు సురేందర్, మున్సిపల్ మాజీ చైర్మన్ శీలం శ్రీనివాస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకుల దిష్టిబొమ్మ దహనం చేశారు. అనంతరం ఈటల చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. పేదల కోసం అహర్నిశలు పాటుపడే ఈటల రాజేందర్‌పై కాంగ్రెస్ నాయకుల వ్యాఖ్యలను ఖండించారు. ఈటలకు బేషరత్‌గా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధికార ప్రతినిధి రమారెడ్డి, సట్ల సునీల్‌గౌడ్, గండికట సమ్మయ్య, ముకుంద సుధాకర్, అహ్మద్‌పాషా, అప్పం మధు, పర్శరాంగౌడ్, విజయ్‌గౌడ్, శ్రీనివాస్‌గౌడ్, శివ, చిలుక, హరికుమార్ పాల్గొన్నారు.